www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 07 | మే | 2025
పేజీలు 8

## లొంగిపోయిన 14 మంది మావోయిస్టులు

- వివరాలు వెల్లడించిన ఎస్‌పి రోహిత్ రాజ్

2 లో



### సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా

# సాగుతున్న ప్రజాపాలన



-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
-గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు పూర్తి
-భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/కూసుమంచి :** సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా ప్రజా ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూసుమంచి మండలం నేలపట్ల గ్రామం ఎస్సీ కాలనీలో 24 లక్షలతో, మల్లేపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో 36 లక్షలు, జక్కేపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో 20 లక్షలు అంచనా విలువతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 15 కోట్ల అంచనా వ్యయంతో పాలేరు పట్టణ పరిధిలో

మిగతా 2లో..

## జిల్లాలో గాలి దుమారం



-పలు చోట్ల విరిగిపడిన చెట్లు
-ఖమ్మంలో భారీ వర్షం

2 లో

## సింగరేణి జనరల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు

-యాజమాన్యానికి అందజేసిన గుర్తింపు సంఘం ఏఐటియుసి



2 లో

### జాతీయ రహదారుల

# అభివృద్ధికి సహకరించాలి

-కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి మంత్రి తుమ్మల వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మంజిల్లా జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గడ్కరితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధి, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ రహదారుల అభివృద్ధితో ప్రగతికి బాటలు పడతాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు జాతీయ రహదారులను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. జాతీయ రహదారుల అభివృద్ధితో రాష్ట్రాల మధ్య

మిగతా 2లో..

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు



-తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇండ్ల నిర్మాణం
-నిరుపేద లబ్దిదారులకు డ్వాక్రా ద్వారా రుణాలు మంజూరు
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిబంధనల ప్రకారం అర్హులకు ఇండ్లను కేటాయించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికపై అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. పైలెట్ గ్రామాల్లో 878 ఇండ్లు మంజూరు చేస్తే 409 ఇండ్లు బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించామని 370 మంది లబ్దిదారులకు ప్రభుత్వం మొదటివిడత లక్ష రూపాయల ఆర్థిక సాయం విడుదల చేసిందన్నారు. మిగిలిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు. మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పైలెట్ ప్రాజెక్టు మంజూరు చేసిన ఇండ్ల పురోగతి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడివోలు ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను గ్రౌండింగ్ చేసే ముందు సంబంధిత లబ్దిదారులకు,

మిగతా 2లో..

## సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా
# సాగుతున్న ప్రజాపాలన

(మొదటిపేజీ తరువాయి)
సూర్యాపేట అశ్వరావుపేట రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులు సైతం చేపట్టామని, పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. నేలపట్ల గ్రామంలో పెండింగ్ అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు వర్షాకాలంలోపు పూర్తి చేస్తామని, ఇండ్లపై నుంచి వెళ్తున్న హై టెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించే కార్యక్రమం చేపట్టామని, గ్రామాల మధ్య లింక్ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నామని, సాగునీరు అందించే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం రేషన్ ద్వారా నిరు పేదలకు ఉగాది నుండి సన్న బియ్యం సరఫరా చేస్తుందని, ఇందిరమ్మ కమిటీ అందించిన జాబితా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతలో నిరుపేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని, యాసంగి సీజన్ లో కూడా రైతులకు బోనస్ చెల్లిస్తామని అన్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలను అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ నిరుపేదలకు ఇచ్చిన భరోసా ప్రకారం చిత్తశుద్ధితో పనిచేస్తామని, ఇచ్చిన ప్రతి మాటను పేదవానికి చేర్చడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏడిఏ సరిత, కూసుమంచి మండల తహశీల్దార్లు కరుణశ్రీ, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)
మేస్త్రిలకు మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లను చూపించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటిని ఎలా నిర్మించుకోవాలో హౌజింగ్ శాఖకు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన అసిస్టెంట్ ఇంజనీర్ ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ప్రతి వారం రిపోర్టు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తుందని మొదటి విడత పెట్టుబడి పెట్టలేని నిరుపేదలు ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలని, పైలెట్ ప్రాజెక్టులో దాదాపు 300 లకు పైగా పేదలకు అందించామని తెలిపారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన లబ్దిదారులతో చర్చించి త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని డబ్బు సమస్య ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శి ఫోటో తీసి అప్‌లోడ్ చేస్తారని వీటిని అసిస్టెంట్ ఇంజనీరు, డిఈ క్షేత్రస్థాయిలో ధృవీకరణ చేస్తారని, జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి వెళ్లి లబ్ధిదారులకు చెల్లింపులు జరుగుతాయన్నారు. వివాదాలకు తావులేకుండా లబ్ధిదారుల జాబితా ఎంపిక చేయాలని ఖమ్మం జిల్లాలో డబ్బులు లేని కారణంగా గ్రౌండింగ్ చేయకుండా ఎవరు వేచి చూసేందుకు వీలు లేదన్నారు. ఖమ్మం జిల్లాకు 14,763 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే 10,921 దరఖాస్తులు సర్వే చేసి 9150 దరఖాస్తులకు అర్హత ఉందని తేలిందన్నారు. తుది లబ్దిదారుల జాబితా ర్యాండమ్‌గా చెక్ చేసి అర్హులకు మాత్రమే జాబితాలో చోటు కల్పించారా లేదా గమనించి వివరాలను అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే ఇండ్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, ఈఈ హౌజింగ్ శ్రీనివాస్, డిఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, ఆర్డీవో కల్లూరు రాంచందర్, ఎంపిడివోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలి

(మొదటిపేజీ తరువాయి)
సంబంధాలు పెరగడంతో పాటు ప్రధానంగా వాణిజ్య, పర్యాటక రంగాలు విశేషంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ జాతీయ రహదారుల నిర్మాణంతో రాష్ట్రాల మధ్య దూరాభారం తగ్గుతుందని, రెండు తెలుగురాష్ట్రాలు శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రికి వివరించారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే కి రెండు వైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల పరిసర నియోజక వర్గ గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయించాలని కోరారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వయా వైరా మీదుగా 100 కిలో మీటర్ల జాతీయ రహదారికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభం కావడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రెండు రాష్ట్రాల మధ్య దూరాభారం తగ్గుతుందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రాచలానికి ఇరు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు దూరాభారం తగ్గించిన వారమవుతామన్నారు. అదేవిధంగా కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటవుతున్నందున ప్రయాణికులకు కూడా మెరుగైన సౌకర్యం అందుతుందన్నారు. ప్రపంచంలో రెండవ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటవుతుందని ఇక్కడికి వచ్చి చదువుకునే విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా సింగరేణి గనులకు కొలువై ఉన్న కొత్తగూడెంకు జగ్గయ్యపేట నుంచి జాతీయ రహదారి నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల మధ్య వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి మంత్రి తుమ్మల వివరించారు. ఖమ్మం కురవి రోడ్డు నుంచి అమరావతి నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఏడు కిలో మీటర్ల లింకు రోడ్డును అనుసంధానం చేయాలని కోరారు. ఈ లింకు రోడ్డు వల్ల ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం చుట్టూ ఉన్న నియోజక వర్గాల ప్రజలు ఖమ్మం నగరానికి సులువుగా దూరాభారం తగ్గించుకోవడానికి వీలుంటుందని తెలిపారు. మంత్రి తుమ్మల అడిగిన జాతీయ రహదారుల పనులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# సిజిలో ఉప సర్పంచ్‌ను హత్య చేసిన మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో ఉప సర్పంచ్‌ను మావోయిస్టులు కిరాతకంగా హత్య చేసినట్లు ఆరాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో జగర్గుండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెప్పల్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, తరగూడ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ ముచాకి రామ ఇంటికి వెళ్లిన సాయుధ మావోయిస్టులు మాట్లాడే పని ఉంది రమ్మని వారి వెంట తీసుకెళ్లారు. ఎంతకి అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆ ప్రాంతంలో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఏడాది బస్తర్ డివిజన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తొమ్మిది మంది పౌరులను మావోయిస్టులు హత్య చేశారు. గత ఏడాది నుండి ఇప్పటి వరకు వివిధ హింసాత్మక సఘటనల మూలంగా బస్తర్ ప్రాంతంలో 68 మంది పౌరులు మృత్యువాత పడ్డట్లు పోలీసుల రికార్డుల్లో ఉంది.

# లొంగిపోయిన 14 మంది మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుట 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మేరకు ఆయన మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారిని ప్రవేశ పెట్టి వివరాలు వెల్లడించారు. వివిధ క్యాడర్ల మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టు పార్టీలో కాలం చెల్లిన సిద్ధాంతాలు ఉండటం వల్ల వీటిని గమనించి కొందరు సభ్యులు లొంగిపోయేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున ఉపాధి అవకాశాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి కోసం దశలవారీగా కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు 257 మంది వివిధ హోదాల్లో ఉన్న మావోయిస్టు సభ్యులు లొంగిపోయారని, గత కొంత కాలంగా సిపిఐ మావోయిస్టు పర్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ,నమ్మకం కోల్పోయిందని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే తమతో పాటు తమ క్రింది తరం వారికి కూడా మనుగడ ఉందని వారు బలంగా నమ్మడం మూలంగానే లొంగుబాట పట్టినట్లు ఎస్పి వెల్లడించారు. మావోయిస్టు నాయకుల దశ్చర్యలతో ఆదివాసీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, పోలీస్ ఇన్‌ఫార్మర్లతో పేరుతో కొందరు అమాయక ఆదివాసీలను మావోయిస్టు చంపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అడవిలో ఉన్న మావోయిస్టులు జన జీవన స్రవంతిలోనికి రావాలని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపు నుండి పునరావాసం కల్పిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో గాలి దుమారం

**ప్రజాపక్షం/ఖమ్మం :** గాలి దుమారం ఖమ్మంజిల్లాను అతలాకుతలం చేసింది. మంగళవారం సాయంత్రం ఉధృతమైన గాలితో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షానికి ముందు వచ్చిన గాలి దుమారం ఆ తర్వాత భారీ వర్షానికి పలు చోట్ల చెట్లు నేల కూలాయి. భారీ వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. నెల రోజులుగా కల్లాల్లో ఉంచిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఆకస్మాత్తుగా వర్షం రావడంతో పట్టాలు కప్పే అవకాశం కూడా లేకుండాపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలో భారీ వర్షం కురిసింది. నగరంలోని ప్రధాన రహదారుల వెంట నీళ్లు పారాయి. సారథి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జికి నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గంటలకొద్దీ కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది.

# సింగరేణి జనరల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి సింగరేణి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మంగళవారం సమ్మె నోటీసును సింగరేణి జనరల్ మేనేజర్ కవిత నాయుడుకు అందజేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు మే 20న సమ్మెకు పిలుపునిచ్చాయని అందులో సింగరేణి కార్మికులు కూడా పాల్గొనాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజ్‌కుమార్ తెలిపారు. సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జోడిస్తూ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించడం జరిగిందన్నారు. మే 20న జరిగే టోకెన్ సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని రాజ్‌కుమార్ కోరారు. 1931లో నిజాం ప్రభుత్వం చేసిన ఒప్పందం మేరకు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటు పరం చేయరాదని ఆయన తెలిపారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, అలవెన్సులపై ఆదాయపన్నును ఎత్తివేయాలని సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ. 20వేలు అమలు చేయాలని, కనీస పెన్షన్‌ను తొమ్మిది వేలకు పెంచాలని సింగరేణి సమస్యలపై ఇచ్చిన నోటీసులో పేర్కొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వైవి రావు, ఎం. ఎల్లాగౌడ్, కె. సారయ్య, కందికట్ల వీరభద్రం, ఉసిక సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి వెంకట్, నాయకులు రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జేవిఆర్ ఓసిని సందర్శించిన సెక్యూరిటీ అధికారి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ మంగళవారం సత్తుపల్లి జలగం వెంగళరావు ఉపరితల గనిని సందర్శించారు. గతంలో ఏరియా సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సెక్యూరిటీ అధికారి అభిలాష్ సత్తుపల్లి జే.వి.ఆర్ ఓ.సిని సందర్శించారు. ఈ సందర్భంగా జే.వి.ఆర్ సెక్యూరిటీ సిబ్బంది నూతన అధికారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అభిలాష్ ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ జమేదార్ బందెల విజయేందర్, మల్లేష్, సీనియర్ సెక్యూరిటీ గార్డ్స్ రవీందర్ రెడ్డి, ఎం.జోసెఫ్, కే.ఎస్.వి.వి నారాయణ, ఎస్.కె సుభాని, మోతుకూరి రవి, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్స్ గుర్రం రామకృష్ణ, కొక్కెర గద్ద నగేష్, నక్క శ్రీనివాస్, సెక్యూరిటీ గార్డ్స్ పాలకుర్తి లక్ష్మయ్య, పత్రా రాజా, ఏలూరి శివ, సత్యనారాయణ, కిషోర్, శివాజీ పాల్గొన్నారు.

# పారదర్శకంగా యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక



**-1:2 నిష్పత్తిలో జాబితా అందించాలి**
**-యువ వికాసంపై కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ డా ॥ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో ఎస్సి, ఎస్టి, బీసి, మైనార్టీ, ఈబిసి వర్గాల క్రింద రాజీవ్ యువ వికాసం క్రింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని ధృవీకరణ చేశాం, అర్హుల ఎంపికకు తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ధృవీకరణ 90 శాతానికి పైగా పూర్తయిందన్నారు. తుది లబ్ధిదారుల జాబితా ప్రతి విభాగంలో తయారు చేయాల్సి ఉంటుందని బ్యాంకర్ల చేత లింకేజీ రుణాలు మంజూరు చేసుకోని జూన్ రెండు నుంచి యూనిట్ల గ్రౌండింగ్‌పై శ్రద్ధ పెట్టాల్సి ఉంటుందన్నారు. యువ వికాస పథకం లబ్ధిదారుల జాబితా ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎటువంటి ఒత్తిళ్లకు తావివ్వడానికి వీలు లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో న్యాయంగా ఉన్న అర్హుల జాబితాను ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో వివిధ విభాగాలకు కేటాయించిన యూనిట్ల లక్ష్యం మేరకు 1:2 నిష్పత్తిలో లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక సమయంలో దివ్యాంగులు, మహిళలు, అతి పేదలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి బిసి ఫెడరేషన్‌లకు కేటాయింపులు జరగకపోతే మన జిల్లాలో ఉన్న జనాభా లెక్కల ఆధారంగా కేటాయింపు చేసి ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, డిఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఎంపిడివోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల అండ ఎర్రజెండా

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** చికాగో నగరంలో చిందిన నెత్తుటిలో తడిసిన ఎర్రగుడ్డ సాక్షిగా..కార్మికులకు అండగా నిలస్తుంది ఎర్రజెండానేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడు గ్రామంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని వెంకట్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు...100సంవత్సరాలు చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ(భారతకమ్యూనిస్టు) అన్నారు. నాటి నుంచి నేటి వరకు నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలుస్తున్నట్లు తెలిపారు. శ్రమ దోపిడీకి ఎదురెడ్డి నిలిచి అనేక కార్మిక హక్కులు సాధించడంలో ఎర్రజెండా కీలక భూమిక పోషించిందన్నారు. కానీ నేటి ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పోరేట్ విధానాలతో కార్మికుల హక్కులు కాలరాసే కుట్ర జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎర్రజెండానే అండా అని ప్రజలు విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది సిపిఐ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసంతో కలిగిందన్నారు. కావున కామ్రేడ్స్ ప్రజల పక్షాన పోరాడుతూ..అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ ఎంపీపీలు పగిళ్ల వీరభద్రం, ఆరెంపుల సైదులు, సిపిఐ మండల నాయకులు వెంపటి సురేందర్, గ్రామ నాయకులు ఆరెంపుల కొరివి వీరన్న, కొలిచలం శ్రీను, ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు, కొల్లి సురేష్, గుర్రం ఉప్పలయ్య, సిలివేరు సత్యనారాయణ, తోట బిక్షంపాల్గొన్నారు.

# పబ్లిక్ టాయిలెట్స్, బస్ షెల్టర్ సమస్యకు పరిష్కారం

**ఫలించిన ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుల్ మీరా పోరాటం**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రజలు అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజల ప్రధాన సమస్యకు పరిష్కారం దొరికిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల మీరా అన్నారు. మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంతో పాటు పబ్లిక్ టాయిలెట్స్ బస్ షెల్టర్ నిర్మాణం కూడా చేపడతామని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ స్పష్టంగా తేల్చి చెప్పారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు శాలువాతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల సమస్యను పరిష్కరించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ మూడు నెలల్లో పంచాయతీ కార్యాలయం బస్సు షెల్టర్ పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వాతి బిందు, ఎంపిడిఓ కరుణాకర్, ఎంపిఓ తులశిరాం, పీఆర్ డిఈ, ఏఈ నాగేందర్, కార్తీక్, ఐటిడిఏ, డిఈ, ఏఈ మధుకర్, యశ్వంత్, సీఐ, ఎస్సై ఇంద్రసేనా రెడ్డి, రవి, మండల పార్టీ అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్, జిల్లా నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, రోకటి సురేష్, మధుసూదన్ రావు, ఆర్‌కె నాయుడు, నున్నా రంగారావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి నాగేశ్వరావు, వేల్పుల నర్సింహరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, నున్న క్రిష్ణయ్య, ధారవత్ రాంబాబు గుగులోత్ బాలాజీ, మాలోత్ రఘు, మెంతుల క్రిష్ణ, పోతురాజు నాగరాజు, సీపీఐ ఎంఎల్ దర్మా, జాటోత్ క్రిష్ణ, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పుల్లయ్య బంజర ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా అధికారులు సివిల్ సప్లై జిల్లా అధికారి శ్రీలత, డిపిఎం దర్గయ్య, పిడి డిఆర్డిఏ సన్యాసయ్యలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గన్ని సంచులు లారీలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కొనుగోలును త్వరితగతిన పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని కొనుగోలు కేంద్రం ఇన్చార్జిలకు ఆదేశించారు. అదే విధంగా రైతుకు ఎటువంటి తరుగు తేడా లేకుండా చూడాలని కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు సమాచారాన్ని అందించాలని ఆర్డీవో రాజేంద్ర తెలిపారు. నేరుగా తమ కార్యాలయంలో కి వచ్చి సమాచారాన్ని కానీ ఫిర్యాదును కానీ అందించవచ్చని రైతులకు వివరించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పులి సాంబశివుడు కొనుగోలు కేంద్రం ఇన్చార్జి ఉషోదయ మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని, దోస్త్ అడ్మిషన్ల నందు మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విద్యార్థులను కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిహెచ్‌డి, నెట్, సెట్ వంటి అర్హలతో అపార అనుభవం కలిగిన అధ్యాపక బృందం ఉన్నారని, విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణం, ఇండోర్ స్టేడియం, పోటీ పరీక్షలకు అవసరమైన తర్ఫీదు, విశాలమైన తరగతి గదులు, కంప్యూటర్స్ ల్యాబ్స్, వర్చువల్, డిజిటల్ క్లాస్ రూమ్స్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియేట్ పూర్తయిన విద్యార్థులు తప్పనిసరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసి అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేర్పించాలని, కళాశాల నందు అడ్మిషన్ కోసం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయటం జరుగుతుందని తెలిపారు. అడ్మిషన్ల కోసం పూర్తి వివరాలకు 9440257256, 9553359879 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# అండర్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరాపై సమగ్ర సర్వే





**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో భూగర్భ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్‌శాఖ మధిర సబ్ డివిజన్ కార్యాలయం నందు ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆత్కూర్ రింగ్ రోడ్డు నుండి మధిర పట్టణంలోని నందిగామ బైపాస్ రోడ్డు వరకు, ఆర్‌వి కాంప్లెక్స్ నుండి బస్టాండ్ వరకు భూగర్భ కేబుల్ ఏర్పాటు చేసి అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే విధంగా సమగ్ర సర్వే నిర్వహించి ప్రణాళికలు తయారు చేయాలని ఎస్‌ఈ శ్రీనివాసచారి అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో సమగ్ర సర్వే నిర్వహించి టిజి ఎన్పీడిసిఎల్ కంపెనీకి తగు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ వైరా డివిజన్ డిఈ శ్రీనివాసరావు, కనస్ట్రక్షన్ డిఇ హీరాలాల్, ఆర్‌అండ్‌బి డిఇ శంకర్‌రావు, మున్సిపల్ డిఇ నరేష్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎడిఇలు అనురాధ, నాగమల్లేశరరావు, మధిర పట్టణ ఎఇ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భీష్మారావుకు మున్సిపాలిటీకి సంబంధం లేదు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** టి. భీష్మారావు అనే వ్యక్తికి ఏదులాపురం మున్సిపాలిటీకి ఎటువంటి సబంధం లేదని, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదరు వ్యక్తి గతంలో పెద్దతండ పంచాయతీ ఉండగా బిల్ కలెక్టర్‌గా పని చేసి ఉద్యోగం చేయడం లేదన్నారు. అయినప్పటికీ ప్రజలను నమ్మించి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లుగా మున్సిపాలిటీకి ఫిర్యాదులు అందాయన్నారు. కావున ఏదులాపురం మున్సిపాలిటీ పేరుతో వసూళ్లకు వస్తే చెల్లించవద్దని ప్రజలకు సూచించారు. పోలీసులు, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

# 20న దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మె



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** నాలుగు కార్మిక కోడులను రద్దు చేయాలని, ఆశ వర్కర్లకు కనీస వేతనాలు..పిఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా 50లక్షలు అమలు చేయాలని, ఈ నెల 20న దేశ వ్యాపితి కార్మిక సంఘాలతో సమ్మెను నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఎంవీ, పాలెం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యురాలికి సిఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును ఆశాలు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారులోకి వచ్చిన తర్వాత స్కీమ్ వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష,కార్యదర్శులు బి.మల్లేశ్వరి, బి. జ్యోతి, జిల్లా నాయకులు భాగ్యమ్మ, సుభద్ర, మండల నాయకులు ఉషా, ఉమానాగమణి, నీలిమ, కృష్ణవేణి, సూరమ్మ, అరుణ, సుజాత, తిరపమ్మ, శ్రీవిద్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీరయ్య, వెంకన్న, రవి తదితరలు పాల్గొన్నారు.

# నేటిఫోకస్ విలేకరి మృతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** నేటి ఫోక్ మండల విలేకరి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మిరియాల నాగేశ్వరరావు(65) సోమవారం రాత్రి మృతి చెందారు. మండల కేంద్రం ఎర్రుపాలెం గ్రామానికి చెందిన మిరియాల నాగేశ్వరరావు గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. జనసేన పార్టీ ఆవిర్భాంతో ఆ పార్టీలో చేరి మండల అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆయన భౌతికకాయాన్ని పలు రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

# అక్షరాస్యత పెంచేందుకు చర్యలు

-అధికంగా ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు కేటాయించాలి
-విద్యార్థుల సంఖ్య పెంచేలా బడిబాట
-అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అక్షరాస్యత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా|| పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీజ విద్య, వయోజన విద్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరాక్షరాస్యత తొలగించే దిశగా ప్రతి ఒక్కరికి రాయడం, చదవడం రావాలని కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటిరసి ప్రోగ్రాంను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 50వేలకు పైగా ఉన్న నిరక్షరాస్యులకు ఉల్లాస్ కార్యక్రమ అమలుకు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. మండలంలో ఉల్లాస్ కార్యక్రమంపై రివ్యూ నిర్వహించి వాలంటీర్లను గుర్తించాలని ప్రతి వాలంటీర్ ఐదుగురు నిరక్షరాస్యులకు అక్షరాస్యత నేర్పించేలా కార్యక్రమం అమలు చేయాలన్నారు. మహిళా సంఘాలు, పంచాయతీ కార్యదర్శులకు మరోసారి లక్ష్యాన్ని నిర్దేశించి నిరక్షరాస్యుల గుర్తింపు ప్రక్రియను చేపటాటలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో ఎంత మంది ఉంటున్నారు, అవసరమైన సంఖ్యలో అందుబాటులో ఉన్నారా లేదా పరిశీలించాలని ఎక్కడ కూడా అనవసరంగా డిప్యూటేషన్ ఉండటానికి వీలు లేదన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కంటే గొప్ప వృత్తి మరొకటి లేదని ప్రతి ఒక్కరూ ఆ బాధ్యతను దృష్టిలో ఉంచుకుని పని చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్ణీత క్యాడర్ కంటే అధికంగా స్టాఫ్ ఉన్నట్లు తెలిస్తే సంబంధిత హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల్లో అధికంగా ఉన్న డిప్యూటేషన్లను రద్దు చేసి ఖాళీగా ఉన్న పాఠశాలలకు పంపాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాం క్లాత్ వచ్చిందని మహిళా సంఘాల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టి పాఠశాలలకు వస్తుందని వీటి నాణ్యతను ముందుగా పరిశీలించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మేర పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. జూన్ రెండు వరకు ప్రతి విద్యార్థి ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. బడిబాట కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులు ఉల్లాసంగా గడిపేందుకు అవసరమైన క్రీడా సామాగ్రి పరికరాలు కొనుగోలు చేయాలని, దీనికి అవసరమైన గ్రాంటును ప్రతి పాఠశాలకు అందించామని ఆమె తెలిపారు. త్రాగునీటి సరఫరా సమస్యలు, అదనపు తరగతి గదులు అవసరం ఉన్న పాఠశాల వివరాల ప్రతిపాదనలు అందించాలన్నారు. మే 15 నాటికి ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్‌డేట్ చేయాలని ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ, పాఠశాలల హెడ్ మాస్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి తోలకాలతో చెరువులు లూటీ

-వ్యవసాయ అవసరాల నిమిత్తం దరఖాస్తులు
-వెంచర్లు, ఇండ్ల ప్లాట్లకు తరలింపు
-దర్జాగా దందా చేస్తున్న అక్రమ మట్టి స్మగ్లర్లు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని చెరువులలో మట్టి స్మగ్లర్లు చొరబడి భారీగా మట్టి తోలకాలు చేపట్టి చెరువులను లూటీ చేస్తున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం నీటిపారుదల శాఖ వద్ద దరఖాస్తులు చేస్తూ వెంచర్లు, ఖాళీ స్థలాలు, ఇండ్ల ప్లాట్లకు మట్టిని తరలించి మట్టి అమ్మకాలు చేపడుతున్నారు. ఒక్కో ట్రిప్పు రూ.2500 నుండి, రూ.4 వేల వరకు అమ్ముకుని జేబులు నింపుకుంటూ, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పెడుతున్నారు. సత్తుపల్లి మండలంలో నలుగురు మట్టి మాఫియా సిండికేట్ గా ఏర్పడి చెరువులను లూటీ చేస్తుండగా, వేంసూరు మండలంలో మరికొందరు జేసిబిలా సాయంతో మట్టి తోలకాలు చేపడుతున్నారని మట్టి మాఫియా ఆగడాలను అరికట్టేదెవరని ప్రజలు చర్చించుకుంటున్నారు. సత్తుపల్లి మండలంలోని వేశ్యకాంతల చెరువు, మండల పరిదిలోని రేజర్ల చెరువు, సదాశివునిపాలెం చెరువులతో పాటు కొమ్మేపల్లి ప్రైవేట్ భూముల నుండి టిప్పర్ల సాయంతో భారీ మిషన్ లను ఉపయోగించి మట్టి తోలకాలు సాగుతున్నా నీటి పారుదల, రెవిన్యూ, పోలీస్, రవాణ శాఖాధికారులకు కనిపించకపోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గత 20 రోజులుగా సత్తుపల్లి, వేంసూరు మండలాలలో వందల టిప్పర్ల మట్టి దారి మళ్లుతున్న అధికారులు ఎందుకు కళ్ళు మూసుకున్నారని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ మట్టి దందా చేస్తున్న కొందరు తాము ఆడింది ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారని, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో బహిరంగంగా జరుగుతున్న అక్రమ మట్టి తోలకాలను అరికట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# 20న జరిగే దేశవ్యాప్త టోకెన్ సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మిక లోకం జయప్రదం చేయాలని జె.వి.ఆర్ ఓసి నందు మంగళవారం జరిగిన గేట్ మీటింగ్ లో కార్మికులకు పిలుపునిచ్చారు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్ కుమార్. ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికిసింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలు ఉంటే, వాటిలో కార్మికులకు ఉపయోగపడే 29 చట్టాలను, నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి యాజమాన్యానికి అనుకూలంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా వికే, సత్తుపల్లి ఓసి త్రీలో తీసే ఓబిని ప్రైవేట్ వారిచే తీసే విధంగా, బొగ్గును సింగరేణి సంస్థ ద్వారా తీసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త గనులను ప్రారంభించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. సమస్యలను సి అండ్ ఎండి బలరాం నాయక్ ఐఆర్ఎస్ కు నివేదించామని స్పందించిన ఆయన త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లి ఓసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ దార భీమయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వీరస్వామి, కేజియం ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి జె. గట్టయ్య, సత్తుపల్లి బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి సూర్య ప్రకాష్, బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్ దమ్మాలపాటి నరసింహారావు, ఫిట్ కార్యదర్శి నరసింహారావు, వి.శ్రీధర్, బి .సుధాకర్, బద్రు, కంచ శ్రీనివాస్, భారోత్ శ్రీను, మధు కుమార్, కూనం వెంకటేశ్వర్లు, రోంటాల సురేష్, శంకర్, బి. నరేందర్, ఈపీ ఎలక్ట్రిషన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్
-మే ఐదు నుంచి 19 వరకు ముందస్తు ప్రత్యేక లోక్ అదాలత్

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం చెక్‌బౌన్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ జూన్ తొమ్మిది నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మే ఐదు నుంచి 19 వరకు ముందస్తు లోక్ అదాలత్‌ను జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలు లేదా ఒక పక్షం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే అందుకు సంబంధించిన కేసు వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. ఇరు పక్షాల వారిని పిలిపించి వారి సమక్షంలో వారి న్యాయవాదుల సమక్షంలో మధ్యవర్తిత్వం నిర్వహించి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇరువురి సమక్షంలో రాజీ వివరాలను రాతపూర్వకంగా రాసి ఇరు వర్గాలకు అవార్డు రూపంలో కేసు పూర్తయినట్లుగా తక్షణమే అందిస్తామని తెలిపారు. చెక్‌బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్, మోటార్ ప్రమాదాలు, బ్యాంక్ రికవరీ, వివాహ సంబంధాల కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

# సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా చూడాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మార్కెట్ యార్డ్ వద్ద రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర మార్కెట్ యాడ్ నందు ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఎగుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐకెపి మహిళా అధ్యక్షురాలుని లారీలు సకాలంలో వస్తున్నాయా, గన్ని సంచులు సరిపడా ఉన్నాయా, ఇంకా ఎమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి ఆదివారం వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా ఎండబెడితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాటాలు వేయించి పంపిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సంబంధిత అధికారులకు ఎక్కడా రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

# సందీప్‌ను పరామర్శించిన సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కేతినేని చలపతిరావు కుమారుడు సందీప్ ఇటీవల హైద్రాబాద్‌లో ప్రమాదానికి గురై చికిత్స అనంతరం అంజనాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్‌రావు, తాళ్ళూరి జీవన్ మంగళవారం వారికి ఇంటికి వెళ్లి సందీప్‌ను పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జోనల్ చైర్మన్ దిరిశాల దాసురావు, తెలగవరం మాజీ సర్పంచ్ మువ్వా మురళీపాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలానికి చెందిన ఆలకుంట నవీన్(20) తల్లాడలో మామిడికాయలు కొనుగోలు చేసి ఆటోలో తిరిగి ఖమ్మం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయి నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పలువురు ఎస్‌హెచ్‌ఓల బదిలీలు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాకేంద్రంలోని వివిద పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న స్టేషన్ హౌస్ అధికారులను (ఎస్‌హెచ్‌ఓ)లను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఖమ్మం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ జె.మోహన్‌బాబును త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయగా అక్కడి సిఐ దోమల రమేష్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ కాగా టాస్క్‌ఫోర్స్ సిఐ జె.రామకృష్ణను హైదరాబాద్ ఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. అదేవిధంగా ఐజి ఆఫీస్‌లో వెయిటింగ్‌లో ఉన్న తాటిపాముల కరుణాకర్‌ను ఖమ్మం వన్‌టౌన్‌కు బదిలీ చేయగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వి,ఉదయ్‌కుమార్‌ను సెంట్రల్ క్రైం స్టేషన్‌కు బదిలీ చేశారు. సిసిఎస్, టాస్క్‌ఫోర్స్ సిఐలు బి.బాలాజి, ఎస్.తిరుపతిని హైదరాబాద్ ఐజి కార్యాలయంలో రిపోర్టు చేయవలసిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బాధిత కుంటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

ప్రజాపక్షం/ఖమ్మం, క్రైం : పోలీసు కమిషనర్ కార్యాలయంలో సెక్షన్ సూపరింటెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన యండి హనీఫ్ కుటుంబ సభ్యులకు రూ.14,98,610 ల భద్రతా ఎక్స్‌గ్రేషియా నగదు చెక్కును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పోలీసుశాఖ అన్నివిధాల అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు.

# అసిస్టెంట్ ఇంజనీర్లకు మండలాల కేటాయింపు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-హౌజింగ్ శాఖ విధుల్లో చేరిన 14 మంది ఏఈలు**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హౌజింగ్ శాఖ బలోపేతం చేస్తూ అవుట్ సోర్సింగ్ పద్దతిన ఖమ్మంజిల్లాకు ప్రభుత్వం కేటాయించిన 14 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు మండలాలు కేటాయింపు చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు తెలంగాణ స్టేట్ హౌజింగ్ కార్పోరేషన్ లిమిటెడ్ ఖమ్మం విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీర్లను కేటాయించిందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నూతన ఏఈలు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటాయించిన విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలానికి డి. నగేష్, నేలకొండపల్లి మండలానికి వి. లింగ, రఘునాథపాలెం మండలానికి జి. పుష్ప, చింతకాని మండలానికి టి. సుప్రియ, తల్లాడ మండలానికి షేక్ అస్మా, ఏన్కూరు మండలానికి బి స్నేహ, కల్లూరు మండలానికి ఎన్. సాయిపవన్, వేంసూరు మండలానికి ఎం. శ్రీనివాస్, ముదిగొండ మండలానికి బి. సతీష్, ఎర్రుపాలెం మండలానికి పి. గోపి, సత్తుపల్లి మండలానికి వి. పవన్‌కళ్యాణ్, పెనుబల్లి మండలానికి వై. కమల్ ప్రసాద్, కూసుమంచి మండలానికి ఎ. రవి, తిరుమలాయపాలెం మండలానికి కె. మిథున్ కుమార్ అసిస్టెంట్ ఇంజనీర్లను కలెక్టర్ కేటాయించారు. అసిస్టెంట్ ఇంజనీర్లు సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లకు వెంటనే రిపోర్టు చేయాలని, అసిస్టెంట్ ఇంజనీర్లకు ఇందిరమ్మ ఇండ్ల బాధ్యతలను అప్పగించాలని, వారి పనితీరును పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ భూక్యా శ్రీనివాస్, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజవరకు కొనుగోలు చేస్తాం : కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రైతులు ఆందోళన చెందవద్దని నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగులో చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో ధాన్యం శుభ్రపరిచే యంత్రంతో పాటు, మరి కొందరు రైతులు ట్రాక్టర్‌కు అమర్చిన ఫ్యాన్స్ ద్వారా వడ్లను శుభ్రపరిచే విధానం కలెక్టర్ పరిశీలించారు. రైతులు స్వచ్ఛందంగా నాణ్యమైన వడ్లను తీసుకువచ్చారని, తాలు, తరుగు పేరుతో ఏలాంటి కోత విధించకూడదని సెంటర్ నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు...ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెరిగిందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ధాన్యం నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎఫ్.ఏ.క్యూ.ప్రమాణాలు రాగానే కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులకు అవరోధాలు లేకుండా సాఫీగా కొనుగోలు ప్రక్రియ కొనసాగేందుకు నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయాలన్నారు. ధాన్యం తరలింపు సమయంలో కొనుగోలు కేంద్రాల వద్ద హామాలీ సమస్యలు రాకుండా ముందస్తుగా ప్లానింగ్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలలో సబంధిత అధికారులు, రైతులు ఉన్నారు.

# రైతులను ఇబ్బంది పెటొద్దు

**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** వరి ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కల్పించి రైతులు నష్టపోకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం కొణిజర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్ద రైతుల ఇబ్బందులను రైతుసంఘం బృందం అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాత్రనకా పగలనకా కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవాలంటే రైతులకు ధాన్యం కొనుగోలు శాపంగా మారిందని పేర్కొన్నారు. ట్రాన్స్ పోర్ట్ లేక ఎండలో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కాంట్రాక్టర్ స్పందన లేకపోవడంతో గాలివానలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు వస్తున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆయనతోపాటు రైతుసంఘం జిల్లా నాయకులు చింతల ఆదినారాయణ, రొంటె సీతారాములు, డి నరసింహారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీషిరిడి సాయి మందిరం 30వ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణంలోని సాయి నగర్‌లో ఉన్న శ్రీషిరిడి సాయి మందిరం 30వ వార్షికోత్సవ శ్రీబ్రహ్మసూత్రాత్మక శ్రీభవాని శంకర్‌స్వామి వారి ద్వితీయ వార్షికోత్సవ మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. 1995 సంవత్సరం స్వయంగా స్థల నిర్ణయం చేసిన చోట విగ్రహ ప్రతిష్ట జరిపి నేటికి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాలాభిషేకాలు, పంచామృత స్నానాభిషేకం నిర్వహించారు. ఉదయం 6గంటల నుండి ఏడు గంటల వరకు బాబా వారికి పంచామృత స్థానాభిషేకం నూతన వస్త్రాలంకరణ హారతి నిర్వహించారు. మందిరంలో భన బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు బాబా వారి ఉత్సవిగ్రహమునకు శ్రీభవాని శంకర్‌స్వామి వారికి వచ్చిన భక్తులచే పాలాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం 12గంటలకు బాబా వారికి మధ్యాహ్నా హారతి నిర్వహించారు. తదుపరి భక్తులకు మందిరంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమానికి 5వ వార్డు మాజీ కౌన్సిలర్ మాదినేని సునీత, రాయల అన్నపూర్ణ, వజినేపల్లి సునీత, రాయల రోజా, రాయపూడి రజిని ప్రారంభించారు. రెండో కౌంటర్ ను ఆలయ కమిటీ కోశాధికారి లగడపాటి బోసు, మందిర కమిటీ సభ్యులు తల్లపురెడ్డి గోపాలకృష్ణారెడ్డి, మాదినేని దుర్గాప్రసాద్, మిద్దె సుబ్బారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, మోహన్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ అభిషేక కార్యక్రమాల్లో శ్రీరామనేని శ్రీనివాసరావు, నల్లమోతు లక్ష్మీనారాయణ, చెరుకూరు శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, కోసూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంఎల్‌ఏ పాయం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా మంగళవారం అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అశ్వాపురంలోని ఓరుగంటి వీరయ్య భవన్ నందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు నిర్వహించి మీడియా ముఖంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, స్వావాభిమనుడు ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు వారి కుటుంబాలు సకల సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు నాయకులు, మండల ప్రజల తరపు నుండి కోరుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన అశ్వాపురం ప్రెస్ క్లబ్..**


పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదిన సందర్భంగా అశ్వాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మణుగూరులోని క్యాంప్ ఆఫీస్(ప్రజాభవన్)లో ఎంఎల్‌ఏ పాయంను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెలమ రాజేందర్ మండలంలోని జర్నలిస్టుల యొక్క సమస్యలను వివరించారు. పాయం వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు ములకలపల్లి గోపీనాథ్, పర్సబోయిన రాధాకృష్ణ, గరికపాటి అంజన్‌రావు, గొల్లపల్లి నరేష్, నాగరాజు, సాధు అర్జున్, దేవారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/చింతకాని :** ఐఎన్‌టీయూసీ చింతకాని మండలధ్యక్షుడిగా రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు మంగళవారం శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలను కలుపుకుని కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తానన్నారు.

# మొక్కజొన్న దగ్ధం



**ప్రజాపక్షం/చింతకాని :** మంగళవారం సాయంత్రం చింతకాని మండలంలో వచ్చిన గాలి దుమారం నర్సింహాపురం రైతులకు కన్నీరు మిగిల్చింది.పొలాల్లో రైతులు పెట్టిన నిప్పు గాలి దుమారానికి గ్రామంమీదకి పాకింది. దీంతో గ్రామచివరన రైతు వడ్డె వంశీ కృష్ణ కు చెందిన మొక్కజొన్న పూర్తిగా దగ్ధమైంది. సుమారు 200 క్వింటాళ్ల మొక్కజొన్న పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఫైర్ ఇంజిన్ కు సమాచారమిచ్చినా సమయానికి చేరుకోక పోవడం తో పంట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. 5 లక్షల పంట నష్టపోయినట్లు రైతు వంశీ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశాడు.పక్కనేఉన్న రైతు అచ్చయ్య కు చెందిన 100 క్వింటాళ్ల మొక్కజొన్న , బైక్ అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం 7లక్షల పంట నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో తుడుం కృష్ణకి చెందిన ధాన్యం రూ. 50 వేల నష్టం జరిగింది. మోతారపు వెంకటేశ్వర్లు కు చెందిన మొక్కజొన్న వరి ధాన్యం కు మంటలు అంటుకోవటంతో సమీప రైతులు గ్రామస్థులు అక్కడకి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# ప్రెస్ క్లబ్ సీనియర్స్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రమైన జూలూరుపాడులో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా, ఎల్‌హెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ సీనియర్స్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సీనియర్స్ నూతన అధ్యక్షునిగా కొలిపాక చంద్రశేఖర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా, ప్రెస్ క్లబ్ సీనియర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంచలనాత్మకమైన వార్తలను సేకరిస్తూ, ప్రజలు, అధికారుల మన్ననలను పొందుతున్న సీనియర్స్ ప్రెస్ క్లబ్ మిత్రులకు అభినందనలు తెలిపారు. ఇదే క్రమంలో ముందుకు సాగుతూ ప్రజలు, అధికారుల మనలను పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బానోత్ ధర్మ, లాకావత్ నాగేశ్వరరావు, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్ పాల్గొన్నారు.

# ఏసిపి, తహాశీల్దార్‌కు వినతి



**ప్రజాపక్షం/వైరా:** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశానుసారం వైరా టౌన్ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ, వైరా రూరల్ అధ్యక్షులు దోసపాటి కళ్యాణ్ ఆధ్వర్యంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణ రాష్ట్రంలో చొరబడి అక్రమంగా ఉంటున్న రోహింగ్యాలను గుర్తించి వారి స్వదేశాలకు పంపించాల్సిందిగా కోరుతూ వైరా తహాశీల్దార్‌కి, వైరా ఏసిపికి, వైరా పోలీస్‌స్టేషన్ నందు వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది.

# ప్రయోగాత్మక ఫలితాలను అందించండి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రయోగాత్మకంగా వచ్చిన ఫలితాలను రైతులకు అందించి వ్యవసాయాభివృద్ధికి చేయూతనివ్వాలని వ్యవసాయ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రయోగ విద్య ఎంతో దోహదపడుతుందని చెప్పారు. స్థానిక వ్యవసాయ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మామిడి, మునగ, పామ్ పాండ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో సాగు పద్ధతులపై చర్చించారు. క్షేత్ర సందర్శణ, దత్తత గ్రామాల్లో చేపట్టే సామాజిక కార్యక్రమాల్లో రైతులను కలవాలని వ్యవసాయ పద్ధతులతో పాటు ముఖ్యంగా పామ్ పాండ్ ఆవశ్యకత, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి లేకుండా భూగర్భ జలాల పెంపుకు ప్రజలతో పాటు రైతులు సామాజిక బాధ్యతగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వీటి ఫలితాలు వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయడం కాకుండా వివిధ అంతర్ పంటలు సాగు ద్వారా ఆర్థిక నష్టాల నుండి బయటపడవచ్చునని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సిరులు కురిపించే మునగ సాగును ప్రోత్సహిస్తున్నామని, ఆకులను పొడి చేసి ఆదాయం పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 5వేల ఎకరాల్లో మునగ సాగు అవుతుందని, భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలకు మునగ ఎగుమతి చేసే స్థాయికి జిల్లా చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, ఎడిఎ రవికుమార్, తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఇజిఎస్ ఎపిఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

**అశ్వారావుపేట మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన...**

మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పట్టణ సమీపంలోని 911, కన్నాయిగూడెంలోని 152 సర్వే నెంబర్లను పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖలతో సంయుక్తంగా జాయింట్ సర్వే పూర్తి కావటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన గిరిజనులకు కొత్త హక్కు పట్టాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. గోగులపూడిలో వెదురు బొమ్మలను పరిశీలించి కళాకారులతో ముచ్చటించారు. వీరికి ప్రభుత్వం నుండి ఆర్థిక వెసులుబాటు కల్పించటానికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని ప్రకటించారు. గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఐటిడిఎ ద్వారా నిర్మించిన వ్యాపార సముదాయాలను సందర్శించారు. దుకాణాల ద్వారా ఆదాయ వివరాలను గిరిజన వ్యాపారుల నుండి సేకరించారు. ఆయన వెంట తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


# సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ ఏర్పాటు చేయాలి

**- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని**




**ప్రజాపక్షం / పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసి సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధి జగన్నాథపురంలోని ముంతాజ్ ఫంక్షన్ హాల్ నందు ఎలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రూ.19 కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూములు నష్టపోయి కాలువలు తీసినారు అయినా జిల్లాకి నీరు ఇవ్వటానికి కావాలిసిన డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణం చేపట్టకపోతే జిల్లా ఎండిపోయే అవకాశం ఉందని అన్నారు. జిల్లా నుండి నీరు పోతున్న జిల్లాకు చుక్క నీరు లేకపోతే జిల్లా ప్రజలు చూస్తూ ఊరుకోవాలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాకి అన్యాయం జరుగుతుంటే తెలంగాణ రైతు సంఘం చూస్తూ ఊరుకోదని, దీనిపై ఈ నెల 20వ తేదీ వరకు గ్రామ గ్రామాన సభలు పెట్టి ప్రజలను చైతన్యం చేస్తామని అన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు మండల స్థాయి ధర్నాలు నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టరేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, నాయకులు ధర్మ, లక్ష్మీ నారాయణ, రవికుమార్, సత్యనారాయణ, తిరుపతిరావు, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, వినోద్, శ్రీనివాసరావు, వెంకట్రావు, రామారావు, శంకరయ్య, సమ్మక్క తదిరుతు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి



**ప్రజాపక్షం/కల్లూరుః** మండలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బందితో కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు డి ఈ రాములు తెలిపారు. మండల పరిధిలోని కొర్ల గూడెం రైతు వేదికలో విద్యుత్ భద్రత పై సలహాలు సూచనలు ప్రమాదాలు నివారణ కు సిబ్బందిచే ప్రతిజ్ఞ జరిగింది. విద్యుత్ భద్రత కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన విద్యుత్ సిబ్బంది కు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవలంబించవలసిన విద్యుత్ భద్రత సూచనలు, ప్రమాదాలు నివారణకు సలహాలు, సూచనలు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యుత్ భద్రత వినియోగం పొదుపుపై మండల పరిధిలోని పలు గ్రామాలలో వారం రోజులు పాటు కరపత్రాలను పంచుతూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని ప్రమాదాల నివారణకు ఎల్ సి యాప్ అందుబాటులోకి తెచ్చామని ప్రమాదాలు జరగకుండా సిబ్బందికి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డి ఈ రాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ సతీష్, ఏఈలు ఉమాకాంత్, ప్రసాద్, కృష్ణ కాంత్,వెంకట్, రామ్‌రెడ్డి, రవితేజ, భజేంద్ర కుమార్ తోపాటు సత్తుపల్లి డివిజన్లోని పెనుబల్లి, తల్లాడ సబ్ డివిజన్, పరిధిలో విద్యుత్ కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో జిఐఎస్ పాత్ర కీలకం




**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్ :** నిత్య జీవితంలో జిఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం)పాత్ర ఎంతో కీలకమని ముంబై జిఐఎస్ సబ్జెక్ట్ నిపుణులు అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం బృందం జిల్లాలో పర్యటించింది. ఈమేరకు పాల్వంచలోని అనుబోస్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జిఐఎస్ ద్వారా పలు రకాల మ్యాప్‌లు తయారు చేయవచ్చని, అదే విధంగా ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో కూడా ఉపయోగించవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ముంబై ఐఐటి ద్వారా ఇంటర్ షిప్ చేసే విధంగా ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, మెడికల్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హాజరు కానున్నారన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.

# ఎనిమిదిన ఖమ్మంలో జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల ఎనిమిదిన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మాధవి తెలిపారు. ఎంఆర్‌ఎఫ్ కంపెనీలో పని చేయుటకు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు ఐటిఐ అర్హత కలిగిన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని తెలిపారు. 550 ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# నేడు మంత్రి పొంగులేటి పర్యటన



**ప్రజాపక్షం/భద్రాచలం :** రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు భద్రాచలం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల పర్యటన అనంతరం మ. 1 గం.కు చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయితీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. లక్ష్మీ కాలనీలో గల నూతన గ్రంధాలయ భవనం ప్రారంభించిన అనంతరం, తేగడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 3 గం.లకు దుమ్ముగూడెం మండలంలోని చిన్నబండిరేవు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శంఖుస్థాపన, సిసిరోడ్డను ప్రారంభించనున్నారు. సా.4.15కి సింగవరంలో హైలెవల్ బ్రిడ్జీ నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. సా.4.45 కి భద్రాచలంలోని చర్లరోడ్‌లో సిసి రోడ్లు, డ్రైన్లు ప్రారంభిస్తారు. 5 గం.లకు బాలికల ఆశ్రమ పాఠశాల డైనింగ్ హాల్ ప్రారంభిస్తారు. తాతగుడి సెంటర్‌లోని గ్రంధాలయంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

# ప్రభుత్వ ఫథకాల అమలు వేగవంతం కావాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల అమలు జిల్లాలో వేగవంతం కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని అధికారులతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు వారంలోగా చేయాలన్నారు. పామ్‌ఫాండ్ నిర్మాణాలు వానం కాలం కల్లా చేపట్టారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల జాబితా త్వరితగతిన పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంతకం చేసిన జాబితాను ప్రతీ రోజు వార్డు, గ్రామ, మండల స్థాయి నివేదికలను అధించాలన్నారు. పూర్తి అయిన జాబితాను ఇంచార్జ్ మంత్రి అనుమతి కోసం ప్రతీ రోజు పంపాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంఎల్ఏ పాయం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా మంగళవారం ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి, స్వావాభిమనుడు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అని వారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారు వారి కుటుంబాలు సకల సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు నాయకులు, మండల ప్రజల తరపు నుండి కోరుకుంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, పెండకట్ల పాపారావు, కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఎండి అత్వార్, యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, ఊకే ఎర్రయ్య, కొరస నాగేశ్వరరావు, ఊల్లోజు భరత్, ముప్పారపు రాము, సునీత, తులం ముత్తిలింగం, మోకాళ్ళ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.